## క్లుప్తంగా

### నూతన కమిటీకి మాజీమంత్రి అభినందనలు



మాజీ మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న పట్టణ పార్టీ నాయకులు

**కాశీబుగ్గ:** పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి వైఎస్సార్‌సీపీ నూతన కమిటీని ఇటీవల అధిష్టానవర్గం ప్రకటించింది. దీంతో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును నూతన కమిటీ ప్రతిధులు ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. కమిటీలో స్థానం కల్పించినందుకు అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలియజేసి సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి సంతోష్, కార్యదర్శి రంది రాజారావు, నాయకులు కింతల జనార్దన, మల్లా నాని, ముద్దాపు నరసింహ, యాళ్ల సంతోష్, వంకల రాజు, నెయ్యిల శివ, బద్రి శ్రీకాంత్, తలగాన గంగాధర్, సనపల కిరణ్, కొత్తపల్లి వాసు, ఉర్థాన వెంకట్, రాపక లక్ష్మణ ఉన్నారు.

### మండల ఉపాధ్యక్షుడుకి రట్టి గ్రామస్తులు అభినందన



పితంబరాన్ని అభినందిస్తున్న మాజీ మంత్రి అప్పలరాజు

**మందస:** వైఎస్సార్‌సీపీ మందస మండల ఉపాధ్యక్షుడుగా రట్టి గ్రామానికి చెందిన పులారి పితంబరం నియమితులయ్యారు. దీంతో గ్రామ నాయకులంతా కలిసి పలాసలో మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పింబరాన్న మాజీ మంత్రి సత్కరించి అభినందించారు. మండలంలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో భేతాలపురం సర్పంచ్ సింహాద్రి, బత్తిన లక్ష్మణ్, నియోజకవర్గ సాంస్కృతిక విభాగ అధ్యక్షులు మామిడి కృష్ణారావు, మార్పు కృష్ణారావు, కోదండరావు, పులారి కూర్మారావు, మోహన్, సూర్య శివ పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌ను సరి చేశారు




సరి చేసిన ట్రాన్స్‌ఫార్మర్

**టెక్కలి:** టెక్కలి–తెంబూరు రోడ్డులో వలియా సాగరం గ్రామం ఎదురుగా ప్రభానందా గ్యాస్ ఏజన్సీ సమీపంలో కాలువ గట్టుపై ఉన్న 40 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను అధికారులు పరిష్కరించారు. ట్రాన్స్‌ఫార్మర్ ఒదిగిపోయి, హెచ్‌టీ లైన్‌ను తప్పించి సింగిల్ ఫేస్ లైన్ అమర్చడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్నటువంటి చిన్నపాటి పరిశ్రమలకు కలిగిన ఇబ్బందులపై ఈ నెల 20న 'విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం' శీర్షికతో కథనం 'సాక్షి'లో వెలువడింది. దీంతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. దీంతో స్థానికంగా ఉన్న పరిశ్రమల నిర్వాహకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### స్నేహితుల ఔదార్యం



సాయాన్ని అందజేస్తున్న స్నేహితులు

**ఇచ్ఛాపురం రూరల్:** తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం కుమారుడు (రెండున్నర నెలలు) హైడ్రో సెఫలస్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పురుషోత్తంతో చదువుకున్న 2001–2002 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితులు స్పందించారు. పసివాడి శస్త్ర చికిత్స కోసం 37,500 రూపాయలను పురుషోత్తానికి ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.



# క్షీణించిన పారిశుద్ధ్యం!

- డివిజన్ కేంద్రమైన టెక్కలిలో మరింత అధ్వానం
- పారిశుద్ధ్య నిర్వాహణపై లోపిస్తున్న పర్యవేక్షణ



లక్ష్మీనృసింహా ఆలయానికి ఎదురుగా కాలువలో పేరుకుపోయిన చెత్త



కొండ్రవీధిలో రోడ్డుకు ఆనుకుని ఇళ్ల మధ్యనే చెత్త నిల్వలు

**టెక్కలి:** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. ఒక వైపు పడుతున్న వర్షాలు, మరో వైపు ఎక్కడ చూసినా తాండవిస్తున్న అపారిశుద్ధ్యంతో టెక్కలి నియోజకవర్గంలో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా డివిజన్ కేంద్రమైన టెక్కలిలో పారిశుద్ధ్య నిర్వాహణ సక్రమంగా లేదు. దీనిపై ఇటీవల జరిగిన మండల సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు పెద్ద ఎత్తున అధికారులను నిలదీశారు. అలాగే జిల్లా పరిషత్ సమావేశంలో సైతం టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యంతోపాటు మరికొన్ని సమస్యలపై నిలదీశారు. డివిజన్ కేంద్రంలో పారిశుద్ధ్య నిర్వాహణపై అధికార యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ లేకపోవడంతో వీధులన్నీ కంపుకొడుతున్నాయి. ఒక వైపు డివిజన్ కేంద్రం, మరో వైపు మేజర్ పంచాయతీ టెక్కలిలో 20 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల పరిధిలో 180కు పైగా వీధులు ఉన్నాయి. సుమారు 47 వేలకు పైగా జనాభా ఉంది. అయితే రోజు రోజుకూ జనాభాతో పాటు నివాసాలు విస్తరిస్తున్న నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వాహణ విషయంలో యంత్రాంగం లోపం కనిపిస్తోంది. పారిశుద్ధ్య నిర్వాహణ కోసం సుమారు 67 మంది రెగ్యులర్, కాంట్రాక్ట్ ప్రాతిపదికన కార్మికులు పనిచేస్తున్నారు. చెత్త సేకరణకు ట్రాక్టర్లు ఉన్నప్పటికీ, క్షేత్ర స్థాయిలో మాత్రం చెత్త సేకరణ విషయంలో జాప్యం కనిపిస్తోందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

### కంపుతో భరించలేకపోతున్నాం



మా వీధిలో విపరీతంగా చెత్త నిల్వలు పేరుకుపోతున్నాయి. వాటిని తొలగించడం లేదు. దీంతో భరించలేని కంపు వ్యాపిస్తోంది. మా వీధిలో ఎప్పుడు ఇదే సమస్య స్థానికులను ఇబ్బంది పెడుతోంది. పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

–టి.రామ్‌కుమార్, కొండ్రవీధి, టెక్కలి

### ఎన్నిసార్లు చెప్పినా ఫలితం లేదు



మా వీధిలో చెత్త తొలగించే విషయంలో ఎన్నిసార్లు అధికారులు చెప్పినా సమస్య పరిష్కారం కావడం లేదు. చుట్టు పక్కల వారంతా వేస్తున్న చెత్తను పంచాయతీ సిబ్బంది తీయడం లేదు. దీంతో రోజులు తరబడి పేరుకుపోయి భరించలేని కంపు వ్యాపిస్తోంది.

–టి.గోవిందరావు, కొండ్రవీధి, టెక్కలి

# భయపెడుతున్న.. శునకాలు!





గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

- ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నజనం

**ఇచ్ఛాపురం టౌన్:** నియోజకవర్గ కేంద్రం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో వీధికుక్కలు అలజడి సృష్టిస్తున్నాయి. వీటి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఏ వీధిలో చూసిన గుంపులు గుంపులుగా సంచరిస్తూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి జనం భయపడుతున్నారు. మూడు నెలల క్రితం మున్సిపల్ అధికారులు కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్సలు జరిపించారు. అయినప్పటికీ వేరే ప్రాంతాల నుంచి పట్టణంలోకి వచ్చేస్తున్నాయి. చికెన్, మటన్ దుకాణాల వద్ద వాటి వ్యర్థాల కోసం, హోటళ్ల వద్ద కుక్కలు గుంపులుగా ఉంటున్నాయి. సాయంత్రమైతే పరిస్థితి మరీదారుణంగా ఉంది. ద్విచక్ర వాహనాలను వెంబడిస్తూ కాలును పీకేస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఒంటరిగా బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. పాఠశాలలు, ట్యూషన్ సెంటర్లకు వెళ్లి రావడానికి పిల్లలు జంకుతున్నారు. గొల్లవీధి, బెల్లుపడ కాలనీ, కార్జివీధి, దానంపేట, మెయిన్‌రోడ్డుతోపాటు చాలా వీధుల్లో గుంపులు గుంపులుగా కుక్కలు రోడ్లపై తిరుగుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టిసారించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### నియంత్రణ చర్యలు తీసుకుంటాం..



మూడు నెలల క్రితం కుక్కల నియంత్రణ చర్యలు తీసుకున్నాం. 860 కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్సలు జరిపించాం. అయినప్పటికీ వాటి సంఖ్య పెరుగుతుంది. మరోసారి కౌన్సిల్‌లో పెట్టి ఆమోదం వచ్చిన తరువాత నివారణ చర్యలు తీసుకుంటాం.

– ఉపేంద్రకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

## నాయకుల పరామర్శ



వజ్రపుకొత్తూరు: తవిటమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అప్పలరాజు



కంచిలి: క్షతగాత్రులను పరామర్శిస్తున్న దేవదాస్ రెడ్డి తదితరులు

**వజ్రపుకొత్తూరు:** అమలపాడు గ్రామానికి చెందిన కర్ని తమిటమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర డాక్టర్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. తవిటమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు దున్న బాలరాజు, పలాస మండల నాయకులు బమ్మిడి దుర్యోధనరావు, జిల్లా కార్యదర్శి దువ్వాడ మధుకేశవరావు, మండల పార్టీ కార్యదర్శి గొరకల విశ్వనాథం, కారాడ గిరిబాబు, కె.మురళి, కె.నారాయణ, డి.డిల్లీరావు ఉన్నారు.

**కంచిలి:** కంచిలి జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ఢీకొనడంతో జెన్నాగాయి గ్రామానికి చెందిన దుర్యోధన జెన్నా, తులసి జెన్నా, మూడేళ్ల కుమారుడు ఢిల్లేశ్ జెన్నాలు తీవ్రగాయాలయ్యారు. సోంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పరామర్శించారు. పరామర్శలో స్థానిక సర్పంచ్ గణప సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు వంకల జయరాం, గుమ్మడి రామయ్య, వంకల దుర్యోధన, భాస్కరరావు ఉన్నారు.

## విరిగిన కాలువ పైపలకలు

**మందస:** మందస కేంద్రంలోని మార్కెట్‌కు వెళ్లే మార్గంలోని కాలువపై ఉండే సిమెంట్ పలకలు విరిపోయాయి. పెద్ద వాహనాలు వెళ్లడంతో పలకలు విరిగిపోవడంతో ప్రజల ఇబ్బంది పడుతున్నారు. ఏమాత్రం అశ్రద్ధగా వెళ్లిన ప్రమాదానికి గురయ్యే ప్రమాదం ఉందని కాపువీధి, చాకలివీధి, దేవరివీధి, సాహూ బ్రహ్మణ వీధి, కిల్లమ్మవీధి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి విరిగిన పలకల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



విరిగిన సిమెంట్ పలకలు

## తిరుమలలో జి.బెలగాం కళాకారుల భజన



భజన చేస్తున్న జి.బెలగాం సభ్యులు

**కవిటి:** తిరుమల వెంకటేశ్వరస్వామి సన్నిధిలో జి.బెలగాం గ్రామానికి చెందిన బంగారి తుంబయ్య బృందంచే భజన కాలక్షేపాన్ని ఆదివారం నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నాదనీరాజం కార్యక్రమంలో ప్రదర్శన చేయడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని తుంబయ్య ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం వేకువజామున మరోసారి ఇక్కడ భజన కాలక్షేపం నిర్వహించే అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులకు స్వామివారి ఉచిత దర్శనాన్ని అధికారులు కల్పించారని సభ్యులు తిరుపతి, నారాయణ, దుర్యోధన రౌళో చెప్పారు.

## సేవలతోనే గుర్తింపు



సూర్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

**వజ్రపుకొత్తూరు రూరల్:** విధి నిర్వహణలో చేసిన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని వైద్యాధికారులు డాక్టర్ ఎ.తేజశ్వత, రిచార్డ్ బూన్ అన్నారు. వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన గోరు సూర్యనారాయణ దంపతులను పీహెచ్‌సీ సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీహెచ్‌వో చక్రధర్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, మెడికల్ హెల్త్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

## కూలేందుకు సిద్ధంగా..



శిథిలావస్థకు చేరుకున్న స్తంభం

**ఇచ్ఛాపురం రూరల్:** మండలంలోని కీర్తిపురం రెడ్డిక వీధిలోని సిమెంట్ విద్యుత్ స్తంభం కరెంట్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలేందుకు సిద్ధంగా ఉంది. స్తంభం లోపల ఇనుప చువ్వలు బయటకు వచ్చేశాయి. స్తంభం పైన పెచ్చులూడిపోవడంతో బలమైన గాలులు వీస్తే నేలకొరిగిపోయే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడవం లేదంటున్నారు. ఇప్పటికైనా స్తంభాన్ని మార్పు చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## తులసమ్మకు ప్రత్యేక పూజలు

**ఇచ్ఛాపురం రూరల్:** ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. మేళతాళాలు, కోయ నృత్యాలతో గజముద్దను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి సన్నిధిలో వేటలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## రూ. 50 వేల ఆర్థిక సాయం



భర్త మరణించి విషాదంలో ఉన్న మహిళకు ఆమెతో చదువుకున్న తోటి విద్యార్థులు అండగా నిలిచారు. పలాస మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన వంకల శ్రీదేవి భర్త ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005–06 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆమెను పరామర్శించారు. 50 వేల రూపాయలను శ్రీదేవికి అందజేసి ఇద్దరు పిల్లలు పేరు ఫిక్సిడ్ డిపాజిట్ చేయించి ఔదార్యాన్ని చాటుకున్నారు.

–కాశీబుగ్గ

## మొక్కలను సంరక్షించాలి



నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మందస వెలుగు, ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. పొత్తంగి గ్రామ మహిళ సంఘం ఆధ్వర్యంలో మహిళలకు వన సంరక్షణపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటారు. మండల సమాఖ్య ప్రతినిధులు కాంతమ్మ, విజయ, క్లస్టర్ కోఆర్డినేటర్లు తారక్ మోహన్, రమేష్, మంగమ్మ, రాజారావు, వీవోఏ భారతి ఉన్నారు.

–మందస

## 'రోడ్డు పనులు పూర్తి చేయండి'

**కంచిలి:** మండల కేంద్రం కంచిలిలోనికి ప్రవేశించేందుకు మఠం కంచిలి నుంచి జాతీయ రహదారికి వెళ్లే రహదారి మార్గంలో సగం వరకు నిర్మించిన సిమెంటు రోడ్డును పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. మండల కేంద్రంలోకి వచ్చేందుకు ఉన్న ఈ రహదారి ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ప్రస్తుతం క్రషర్ బుగ్గితో రోడ్డును కప్పేశారని.. వర్షం పడితే ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు.

## కూర్మావతారంలో జగన్నాథుడు



సోంపేట: కూర్మ అవతారంలో జగన్నాథ స్వామి



సోంపేట: బారువలో కూర్మ అవతారంలో జగన్నాథ స్వామి

**సోంపేట:** జగన్నాథ రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా సోంపేట, బారువ పట్టణాల్లో జగన్నాథుడు కూర్మ అవతారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. సోంపేట, బారువ పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**వరాహ అవతారంలో..**

**ఇచ్ఛాపురం టౌన్:** రథోత్సవంలో భాగంగా జగన్నాథస్వామి వరాహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

**కంచిలి:** జగన్నాథ రథయాత్ర తర్వాత జగన్నాథస్వామి గుడించా మందిరంలో విశ్రాంతి తీసుకొంటుండగా భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. గుడించా మందిరానికి రెండు పూటలా భక్తులు వెళ్లి దర్శించుకుంటున్నారు. కంచిలి, కొల్లూరు, జలంత్రకోట గ్రామాల్లో రోజుకో రూపంలో దర్శనమిస్తున్న జగన్నాథ స్వామిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు.



ఇచ్ఛాపురం టౌన్: వరాహ అవతారంలో స్వామి వారు



కంచిలిలో పూజలందుకుంటున్న జగన్నాథుడు